

అధ్యాపకురాలి హత్య కేసులో కీలక మలుపు

అధ్యాపకురాలి హత్య కేసులో కీలక నిందితుడిగా భర్త ఖదీర్‌అహ్మద్, మరో ముగ్గురిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. - 8లో



యువకుడిపై పెట్రోల్ పోసి హత్యాయత్నం

యువకుడిపై ముగ్గురు వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పు అంటించి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బసినికొండ పంచాయతీలో జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1000	రూ.1120
రెండోరకం	రూ.880	రూ.990



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 299 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	260	515
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 163.140 కిలోలు

న్యూస్‌రీల్

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నామని సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 సంవత్సరాల వయస్సు కలిగిఉండాలన్నారు. గ్రామీణ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. దూరప్రాంతాల నుంచి వచ్చు వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈఅవకాశాన్ని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 63028 33546 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఫిర్యాదులపై స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్ రావు

రాయచోటి : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గంగాధర్ రావు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ సూచించారు. స్పందన ద్వారా 71 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు.

ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు



జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసినట్లు వైఎస్ఆర్ కడప జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఎం. సుధీర్ తెలిపారు. ఆదివారం జరిగిన ఎంపికలకు విచ్చేసిన వారిలో రాణించిన వారిని రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు థామస్ జీవన్‌బాబు, సుబ్బయ్య, డేనియల్ గంగులయ్య, అనిల్, మైఖెల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది నుంచి వైవీయూలో దూరవిద్య ప్రారంభం



వైవీయూ పరిపాలన భవనం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం సిగలో మరో కలికితురాయి వచ్చి చేరింది. తాజాగా 'దూర విద్య'ను ప్రారంభించనుండటంతో జిల్లా వాసులతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు సైతం డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా తాము కోరుకున్న విద్యను పొందే అవకాశం లభించింది. గతేడాది వైవీయూకు న్యాక్ ఏ గ్రేడ్ లభించడంతో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రారంభించేందుకు అనుమతి లభించినట్లయింది. దీంతో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేశారు. కాగా వైవీయూ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ తొలి డైరెక్టర్ ఆచార్య ఏజీ దాము, రెండో డైరెక్టర్‌గా ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్, ప్రస్తుత డైరెక్టర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, సహాయ సంచాలకులు డా. ఆర్.శ్రీధర్ బాబు కృషిచేయడం,విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలు సంపూర్ణ సహకారం అందించడంతో త్వరితగతిన డెబ్ అనుమతులు లభించాయి. ఈ ఏడాది జూన్ 26, 27 తేదీల్లో వర్చువల్ విధానంలో నిపుణుల కమిటీ పరిశీలించి 15 కోర్సులకు సిఫార్సు చేసింది.2023–24 విద్యాసంవత్సరం నుంచి డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌ను వైవీయూ అధికారులు ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు.దీంతో రెగ్యులర్ విధానంతో పాటు దూరవిద్యను సైతం విశ్వవిద్యాలయం సమాంతరంగా నిర్వహించనుంది.

కోర్సుల వివరాలు..

యూజీ కోర్సులు : బీఏ జనరల్, బీఏ (హిస్టరీ, ఎకనామిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ (ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీకాం, బీఏ (హిస్టరీ, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ (హిస్టరీ, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు).

పీజీ కోర్సులు : ఎంఏ (హిస్టరీ), ఎంఏ (తెలుగు), ఎంఏ (ఎకనామిక్స్), ఎంఏ (ఇంగ్లీష్), ఎంఏ (జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్), ఎంకాం, ఎంఏ (సైకాలజీ), ఎంఏ (పొలిటికల్ సైన్స్). ఎంఏ (మ్యాథమ్యాటిక్స్).

అక్కచెల్లెమ్మలకు చేయూత



నాపేరు వి. నాజియా. నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లె జాన్సీ ఎస్‌హెచ్‌జీ గ్రూపు మెంబర్‌ని. సున్నా వడ్డీ పథకం మాకు కొండంత అండగా నిలుస్తోంది. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలకు అయ్యే వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తున్నందున జీవనోపాధి మెరుగైంది. మా సంఘానికి రూ.20లక్షల రుణం మంజూరైంది. అందరం కలిసి వ్యాపారాలు చేసుకుంటున్నాం. ఇందులో నా వాటా రూ.2లక్షలు వచ్చింది. నేను దుస్తుల షాపు పెట్టుకున్నాను. బాగా జరుగుతోంది. ప్రభుత్వం క్రమం తప్పకుండా సున్నా వడ్డీ డబ్బులు ఇస్తోంది. ఈ వారంలో మరో దఫా జమ కానుండటం సంతోషకరం.



- పొదుపు మహిళలకు ఆర్థిక అండ.. వైఎస్సార్ సున్నా వడ్డీ
- అన్నమయ్య జిల్లాలో 2,34,256మందికి తోడ్పాటు

సాక్షి రాయచోటి : మహిళ సాధికారత, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మహిళలు ఆర్థిక పరిపుష్టి, స్వయం ఉపాధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు.స్వయం సహాయక సంఘాల మహిళలకు పెద్ద ఎత్తున బ్యాంకు లింకేజీ రుణాలు అందజేస్తున్నారు. మహిళల స్వయం ఉపాధికి బాటలు వేస్తున్నారు. ఆసరా, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలతోనూ ఆర్థికంగా ఆదుకుంటున్నారు. పొదుపు సంఘాలు తీసుకున్న రుణాలకు వైఎస్సార్ సున్నా వడీడ్డ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా చెల్లిస్తున్న సంఘాలకు వడ్డీ రాయితీని జమ చేస్తున్నారు. ఇప్పటికే మూడు విడతలుగా సున్నా వడ్డీ నిధులను మహిళా సంఘాలకు ఖాతాలకు జమ చేయగా.. నాలుగో విడత రాయితీ నిధులను విడుదల చేయడానికి అర్హుల జాబితాను జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది.దీంతో మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది అన్నమయ్య జిల్లాలోని 30 మండలాలు, మూడు పట్టణ ప్రాంతాలు కలుపుకుని 20,223 సంఘాల పరిధిలో 2,34,256 మంది సభ్యులు సున్నా వడ్డీ పథకానికి అర్హత పొందారు. వీరి ఖాతాలకు రూ.23.18కోట్ల నిధులు కొద్ది రోజుల్లో ప్రభుత్వం జమ చేయనుంది.

సున్నా వడ్డీ పథకాన్ని వర్తింపజేసేదిలా.. : 2022 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లిస్తున్న సంఘాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం వర్తిస్తుంది. జిల్లా పరిధిలోని డీఆర్డీఏ, మెప్మా అధికారులు ఈ ఏడాది కసరత్తు ప్రారంభించి ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చారు. సంఘాలు అప్పు తీసుకున్న తేదీ, అప్పు మొత్తం, పొదుపు ఖాతా పుస్తకాల నంబర్లు, బ్యాంకుల ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తదితర వివరాలను మండల స్థాయి అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

జిల్లాలో మహిళా సంఘాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం లబ్ధి ఇలా

సంవత్సరం	సంఘాలు	లబ్ధిదారులు	జమ చేసిన మొత్తం (రూ.కోట్లలో)
2019–20	16,695,	1,92,694,	11.03
2020–21	18695	2,15,414	10.66
2021–22	20,055	2,30,675	13.68
2022–23	20,048	2,30,756	22.62

జీవనోపాధి మెరుగుపడింది



వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం మాకు కొండంత అండగా నిలుస్తోంది. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలకు అయ్యే వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తున్నందున జీవనోపాధి మెరుగైంది. ఈ పథకం కింద నాకు మొదటి విడతగా రూ.1400, రెండో విడతగా రూ.2వేలు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. మూడోవిడతగా రూ.1750లు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఈ ఏడాది సున్నా వడ్డీ సొమ్ము రూ.2వేలు అందనుంది. సొమ్ముతో నేను కిరాణా షాపు నిర్వహిస్తున్నాను.

– ఎం.జ్యోతి (డ్వాక్రా సభ్యురాలు), మదనపల్లె.

గొర్రెల పెంపకం బాగా జరుగుతోంది



మా సంఘానికి రూ.15లక్షల రుణం మంజూరైంది. అందరం వివిధ రకాలుగా జీవనోపాధులు చేసుకుంటున్నాం. ఇందులో నా వాటా రూ.2లక్షలు వచ్చింది. గొర్రెల పెంపకం చేపట్టాను. బాగా జరుగుతోంది. నా అప్పునకు గానూ నాకు గత ఏడాది వడ్డీ కింద రూ.9,500లు వచ్చింది. నాలాగా ఎంతో మంది మహిళలు వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్నారు. ఈ వారంలో మరో దఫా సున్నా వడ్డీ జమ కానుండటం సంతోషకరం.

– బి.పార్వతమ్మ(డ్వాక్రా సభ్యురాలు), నిమ్మనపల్లె మండలం

అర్హులందరికీ వర్తింపు



గ్రామీణ, పట్టణ ప్రాంతంలోని అర్హత ఉన్న ప్రతి పొదుపు మహిళకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని వర్తింపజేస్తున్నాం. నాల్గవ విడత సున్నా వడ్డీ సొమ్మును త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. డీఆర్డీఏ, మెప్మా పరిధిలో 2,34,256మందికి రూ.23.18కోట్ల మేర సున్నా వడద్దీ మాఫీ లభించనుంది.

– గిరీషా పీఎస్, జిల్లా కలెక్టర్

నేతన్నలకు అండగా ప్రభుత్వం

జౌళిశాఖ ఏడీ శ్రీనివాసుల రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

రాయచోటిటౌన్ : రాయచోటిలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను జౌళిశాఖ ఏడీ శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బంగ్లా వరకు అక్కడ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌జీవో హోంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జౌళిశాఖ ఏడీ మాట్లాడుతూ నేతన్నకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వారికి కావాల్సిన పరికరాలపై సబ్సిడీ ఇస్తోందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర తొగట వీర క్షత్రియ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత పరిశ్రమకు ఎంతో మేలు చేశారన్నారు.అనంతరం సీనియర్ చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక నాయకుడు, రాయచోటి చౌడేశ్వరీ దేవి ఆలయ చైర్మన్ విజయభాస్కర్, రాష్ట్ర తొగట వీరక్షత్రియ చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ శీలం రమణమ్మ, మదనపల్లె వైఎస్సార్ సీపీ నాయకుడు శీలం రమేష్, మున్సిపల్ కౌన్సిలర్ ఎంపీ రమణ, కౌన్సిలర్ ఎస్‌వీ రమణ, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు మోడం నాగభూషణం,, వీరబల్లె మండలం మాజీ ఎంపీపీ మోడెం రెడ్డెమ్మ, చేనేత ఐక్య వేదిక నాయకుడు మోడం నాగరాజ, జిల్లా తొగట వీరక్షత్రి సంఘం ప్రధాన కార్యదర్శి గుండ్లపల్లె వెంకటేష్, తొగటవీర క్షత్రియ సేవా సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చిట్టెం రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం

జిల్లా కలెక్టర్ గిరీషాపీఎస్



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ గిరీషా

రాయచోటి : స్పందన జగనన్నకు చెబుదాం అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణలు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. స్పందన జగనన్నకు చెబుదాం అర్జీల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ అవార్డు లిస్టు ఈ నెల 17లోగా పంపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం కావాలి

తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని, అలాగే జాతీయ స్థాయిలో జరగబోయే 'నా భూమి నా దేశం' కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో జీరో డోర్ నంబర్ ఉన్న ఓట్లను పరిశీలించి సరిచేయాలన్నారు. ఒకే డోర్ నెంబర్‌తో 10 మంది కంటే ఎక్కువ ఉన్న ఓట్లను పరిశీలించి సరిచేయాలని అధికారులకు సూచించారు. 'నా భూమి, నా దేశం' గురించి సమీక్షిస్తూ ఈ నెల 14వ తేదీ కల్లా ఇందులో భాగంగా ఉన్న 5 కార్యక్రమాలను(శిలాఫలకాలను ఏర్పాటు చేయడం, ప్రతిజ్ఞ చేయడం, మొక్కలు నాటడం, వీరులకు వందనం, జాతీయ జెండాను ఎగురవేయడం) అన్ని గ్రామ సచివాలయాలలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

వందశాతం టీకా వేయించాలి

వ్యాధి నిరోధక టీకాలు వేసుకోని పిల్లలకు మిషన్ ఇంద్ర ధనస్సు ద్వారా వందశాతం టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ డీఎంహెచ్‌ఓ, వైద్య సిబ్బందికి ఆదేశించారు. సోమవారం రాయచోటి స్పందన హాల్‌లో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మిషన్ ఇంద్ర ధనస్సు, నులిపురుగుల వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు వేయడమే లక్ష్యంగా ఈనెల 7 నుంచి 12వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈనెల 10వ తేదిన నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్ బెండాజోల్) మింగించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి జయరాజ్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, డీఐఓ డాక్టర్ ఉషశ్రీ, ఆర్‌బిఎస్‌కే డిస్ట్రిక్ పీఓ డాక్టర్ శేషగిరి బాబు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

కలికిరి : జగనన్న కాలనీల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టరు పీఎస్ గిరీషా పేర్కొన్నారు. మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని సీఎల్ఆర్‌సీ, కె.మాదిగపల్లి సమీపంలో లేఅవుట్ కాలనీలను కలెక్టరు సోమవారం తనిఖీ చేశారు. సీఎల్ఆర్‌సీ కేంద్రం సమీపంలోని కాలనీ ముందు దారి స్థలం ఆక్రమణలు, విద్యుత్‌లైన్ ఏర్పాటుకు వచ్చిన అభ్యంతరాలను, కాలనీలో నిర్మాణాలలో ఉన్న ఇళ్లను ఆయన పరిశీలించారు. కాలనీ ముందు దారి, సీఎల్ఆర్‌సీ స్థలం ఆక్రమణలపై రెవెన్యూ అధికాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.దారికి అభ్యంతరాలు చెప్పిన, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై అవసరమైతే కేసులు పెట్టాలని ఆదేశించారు. కాలనీ ముందు చెరువు నీటి కాలువ ఆక్రమణకు గురైనట్లు స్థానికులు ఆయనకు విన్నవించారు. కాలనీలో తగిన వసతులు లేవని, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కలెక్టరు ముందు వాపోయారు. పంచాయతీ రాజ్, హౌసింగ్ అధికారులను విచారించిన కలెక్టరు మూడు రోజులలో కాలనీలో తాగు నీటి వసతి, ఇంటింటికి కుళాయి కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ మునిచంద్ర, పంచాయతీ రాజ్ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ గోపాల్ నాయక్, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, తహసీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, ఎస్ఆర్ఈజీఎస్ ఏపీడీ మధుబాబు, ఏఈలు ముజీబుర్ రెహమాన్, వెంకటేష్, అబిద్, ఎస్ఐ కె.రహీముల్లా పాల్గొన్నారు.

నేటి నుంచి తిరుత్తణికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : ఆడికృత్తిక పురస్కరించుకుని మంగళ,బుధవారాల్లో తిరుత్తణికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సి నిరంజన్ తెలిపారు. ఉదయం 5.30, 6 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు.పొన్నై స్వర్ణ వినాయకస్వామి గుడి, వర్షనేరి గణేష్ దేవాలయం, తర్వాత తిరుత్తణి ఆలయం, అనంతరం షోలింగర్ యోగ నరసింహస్వామి గుడి దర్శించుకుని మదనపల్లెకు రావడం జరుగుతుందన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని కోరారు.

ఆవిష్కరణలకు వేదిక.. ఇన్‌స్పైర్

మదనపల్లె సిటీ : ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దానిని వెలికితీసేలా ప్రోత్సహిస్తే భావి శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంది. అలాంటి వారి కోసం జాతీయ ఇన్నోవేషన్ ఫౌండేషన్, కేంద్ర, రాష్ట్ర సాంకేతిక మండలి సంయుక్తంగా ఇన్‌స్పైర్ మనాక్ అవార్డులను ఏటా నిర్వహిస్తున్నారు. పిల్లల్లో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వెలికి తీయడం, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు సులభమైన పద్ధతిలో పరిష్కారం చూపేలా ప్రయోగాలు చేసేందుకు ప్రభుత్వాలు ఈ కార్యక్రమం ద్వారా ప్రోత్సహిస్తున్నాయి. 6–10 తరగతులు చదివే విద్యార్థులు అర్హులు. ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల పేరిట నిర్వహిస్తున్న ప్రయోగాలకు గత ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. భారీ మొత్తంలో నామినేషన్లు వచ్చాయి. ఒక్కో పాఠశాల నుంచి 5 నామినేషన్లు పొందుపర్చేందుకు అనుమతి ఇచ్చారు. ఇందులో ప్రాథమికోన్నతకు సంబంధించి 6,7 తరగతుల వారు 3, ఉన్నత విద్యాలయాలకు చెందిన 6–10 చదివే పిల్లలు 5 సమర్పించే అవకాశం కల్పించారు. విద్యార్థి బ్యాంకు అకౌంట్, రెండు పాసుపోర్టు సైజు ఫొటోలు, ప్రయోగ వివరాలు పీడీఎఫ్, వర్డ్ ఫైల్‌లో వీడియో/ఆడియో, 300 పదాల వరకు వివరణ ఇలా పలు అంశాలను ఇంటర్‌నెట్‌లో నిక్షిప్తం



విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు ఎగ్జిబిషన్ (ఫైల్)

చేయాల్సి ఉంటుంది. సంబంధించిన వివరాలను www. inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లో, లేదా ఈ సంవత్సరం కొత్తగా రూపొందించిన ఇన్‌స్పైర్ యాప్‌లోనూ నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించింది.

- నామినేషన్ల ప్రక్రియ నమోదుకు ఆగస్టు 31 వరకు గడువు ఇచ్చింది. ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎంపికైన ప్రదర్శనకు నేరుగా సదరు విద్యార్థి బ్యాంకు అకౌంట్‌లో రూ.10వేలు జమ చేయనుంది. ప్రయోగానికి అవసరమైన పరికరాలను సమకూర్చుకోవడం, రవాణా తదితర వాటి సౌలభ్యం కోసం వీటిని అందిస్తుంది. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన వాటిలో 15 శాతం రాష్ట్రానికి పంపించనున్నారు. అక్కడ ఉత్తమంగా నిలిచిన 15 శాతం ప్రదర్శనలను జాతీయ స్థాయికి ఎంపిక చేసి ప్రోత్సాహకం అందజేయనున్నారు.

నామినేషన్లు దాఖలు చేయాలి



పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకత, భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇన్‌స్పైర్ వంటి వేదికలు ఎంతో దోహదం చేస్తాయి. ఉపాధ్యాయులు ప్రత్యేకత చూపి పిల్లల వివరాలను త్వరగా ఇంటర్‌నెట్‌లో నిక్షిప్తం చేయాలి.అన్ని యజమాన్యాలకు సంబంధించిన విద్యార్థులు ఇందులో పాల్గొనేందుకు అర్హులు. ప్రతి ఒక్క పాఠశాల వారు విద్యార్థులు కొంగొత్త రూపంలో ప్రయోగాలను ప్రదర్శించేలా చూడాలి. సకాలంలో నామినేషన్లు దాఖలు చేయాలి.

– శ్రీరాం పురుషోత్తం, జిల్లా విద్యాశాఖాధికారి, రాయచోటి.

యువకుడి అదృశ్యం

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన షేక్ షామీర్ బాషా(12) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి కనిపించడం లేదని అతని తండ్రి సలీంబాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు నంబర్లు: 83318 98436/ 9121100559 / 9121100560/9441831706లకు ఫోన్ చేసి సమాచారం తెలపాలని పోలీసులు తెలిపారు.

అంగళ్లు ఘటనపై 5 కేసులు నమోదు

మదనపల్లె : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అంగళ్లు పర్యటనలో భాగంగా చోటుచేసుకున్న అల్లర్లు, ఘర్షణలపై 5 కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ కేశప్ప తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అంగళ్లు ఘటనలో ప్రమేయం ఉన్న వారిగా 50 మందిని గుర్తించామన్నారు. వీడియోలు, సీసీ ఫుటేజీలు, ఐవిట్నెస్‌ల ఆధారంగా 50 మందిని గుర్తించి, త్వరలోనే అరెస్ట్ చేయనున్నట్లు చెప్పారు. సోమవారం 10 మందిని రిమాండ్‌కు పంపామని, నిందితుల గుర్తింపునకు 8 మంది సీఐలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఘటనలో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు జరిపి అరెస్ట్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

యువకుడిపై పెట్రోల్ పోసి హత్యాయత్నం

- మాస్క్‌లు ధరించి ఘాతుకానికి పాల్పడ్డారన్న బాధితుడు
- అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామన్న డీఎస్పీ

మదనపల్లె : ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పు అంటించి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మండలంలోని బసినికొండ పంచాయతీ డ్రైవర్స్ కాలనీలో జరిగింది. ఘటనపై బాధితుడి కుటుంబ సభ్యుల కథనం.. కలకత్తాకు చెందిన మహమ్మద్ ముస్తాక్ పదహారేళ్ల క్రితం మదనపల్లెకు వలస వచ్చి ఇక్కడే వివాహం చేసుకుని స్థానికంగా పండ్ల వ్యాపారం చేసుకుంటూ డ్రైవర్స్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతడి ఏకైక కుమారుడు షేక్ అల్తాఫ్(19) పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం చిన్నేపల్లెలోని మదరసాలో చదువుకుంటున్నాడు. రెండు రోజులు (శని, ఆదివారాలు) సెలవుల్లో భాగంగా డ్రైవర్స్‌కాలనీలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. సెలవులు ముగిశాక సోమవారం ఉదయం చిన్నేపల్లెకు వెళ్లేందుకు సిద్ధంకాగా తల్లి డ్రైవర్స్ కాలనీ బస్టాప్‌లో కుమారుడిని ఆర్టీసీ బస్సు ఎక్కించింది. అప్పటి నుంచి మూడు గంటల తర్వాత అల్తాఫ్ వంటినిండా కాలుతున్న గాయాలతో కేకలు వేస్తూ.. డ్రైవర్స్ కాలనీకి కొంత దూరంలోని హంద్రీనీవా కాలువ ప్రదేశం నుంచి పరుగెత్తుకురావడం స్థానికులు గమనించారు. దీంతో వెంటనే వారు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి చికిత్సల కోసం అల్తాఫ్‌ను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.



తీవ్రంగా గాయపడిన అల్తాఫ్

బాధితుడి నుంచి వివరాల సేకరణ

విషయం తెలుసుకున్న డీఎస్పీ కేశప్ప, టూటౌన్ సీఐ మురళీకృష్ణ, రూరల్ సీఐ సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ కృష్ణప్ప తదితరులు ఆస్పత్రికి చేరుకున్నారు. కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అల్తాఫ్‌ను ఘటనకు దారి తీసిన కారణాలపై విచారణ చేశారు. ఈ సందర్భంగా బాధితుడు.. తల్లి బస్సులో ఎక్కించిన తర్వాత పుంగనూరుకు చేరుకున్నానని, అక్కడ నుంచి చిన్నేపల్లెకు వెళ్లేందుకు మరో బస్సు కోసం చూస్తుండగా, ముగ్గురు యువకులు పల్సర్ బైక్‌లో వచ్చి తాము చిన్నేపల్లె వైపు వెళుతున్నామని, రావాల్సిందిగా కోరారన్నారు. నిజమని నమ్మి తాను వాహనంలోకి ఎక్కాక, తనను తిరిగి మదనపల్లె డ్రైవర్స్ కాలనీ సమీపంలోకి తీసుకువచ్చారని చెప్పాడు. నిందితుల్లో ఒకరు రాజస్థాన్ వ్యక్తిలా తలకు పేట కట్టుకుని మాస్క్ పెట్టుకోగా, మరో ఇద్దరు ముఖాలకు మాస్క్‌లు ధరించి ఉన్నారని చెప్పాడు.

డ్రైవర్స్ కాలనీకి చెందిన ఓ మైనర్ బాలికతో నీవు ఎందుకు మాట్లాడుతున్నావని గదమాయిస్తూ.. బాటిల్‌లో తీసుకువచ్చిన పెట్రోల్‌ను తనపై గుమ్మరించి అగ్గి పెట్టి పారిపోయారన్నారు. కాలిన గాయాలతో ప్రాణాలు రక్షించుకునేందుకు తాను అక్కడి నుంచి పరిగెత్తుకుంటూ ఇంటి వద్దకు చేరుకున్నట్లు చెప్పాడు. నిందితులను గుర్తుపట్టగలవా అంటూ పోలీసులు అడిగిన ప్రశ్నలకు వారెవరో తనకు తెలియదని సమాధానమిచ్చాడు. కాలిన గాయాలతో బాధపడుతున్న అతడి పరిస్థితిని చూసి చలించిన డీఎస్పీ కేశప్ప తక్షణమే మెరుగైన వైద్యచికిత్సల కోసం బెంగళూరు సెయింట్‌జాన్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని, అవసరమైతే ఆర్థికంగా తాను సహకరిస్తానన్నారు. అనంతరం జరిగిన ఘటనపై డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ... యువకుడిపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టిన ఘటనలో బాధితుడు చెప్పుతున్న వివరాలతో అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేస్తామని, నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. అయితే బాధితుడి కథనంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అధ్యాపకురాలి హత్య కేసులో కీలక మలుపు

- హత్యకు పథకం వేసిన భర్త ఖదీర్‌అహ్మద్
- పరారీలో రెండో భార్య ఆయిషా
- హత్యకు ప్రోత్సహించిన నలుగురి అరెస్ట్

మదనపల్లె : పట్టణంలో సంచలనం సృష్టించిన ప్రైవేట్ కళాశాల అధ్యాపకురాలి హత్య కేసులో కీలక మలుపులు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాన సూత్రధారులుగా పేర్కొంటూ ఘటన జరిగిన మరుసటిరోజు పోలీసులు రెండో భార్య ఆయిషా తమ్ముళ్లను అరెస్ట్ చేస్తే.. దర్యాప్తులో భాగంగా హత్యకు పథక రూపకల్పనలో కీలక నిందితుడిగా భర్త ఖదీర్ అహ్మద్, హత్య చేసేందుకు తెరవెనుక సహకారం అందించినందుకు మరో ముగ్గురిని సోమవారం అరెస్ట్ చూపారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కేశప్ప అధ్యాపకురాలి హత్యకేసులో నిందితుల అరెస్ట్‌కు సంబంధించి వివరాలు వెల్లడించారు. కుటుంబంలో ఇద్దరు భార్యలు, వాళ్ల మధ్య ప్రతిరోజు గొడవలు జరుగుతుండటంతో భరించలేని భర్త ఖదీర్‌అహ్మద్.. మొదటి భార్య రుక్సానాను అంతమొందించేందుకు నిర్ణయం తీసుకున్నాడన్నారు. దీనికి ఆయన రెండో భార్య ఆయిషా, ఆమె తమ్ముళ్లు, వారి స్నేహితుల సహకారంతో పక్కా స్కెచ్ వేసి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలిందన్నారు. పట్టణంలోని శివాజీనగర్ చీకలగుట్టకు చెందిన ఖదీర్‌అహ్మద్ వేంపల్లె గ్రామంలో ఏపీఎస్పీడీసీఎల్ డ్యూటీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడన్నారు. ఇతడు మొదట రుక్సానాను వివాహం చేసుకున్నాడని, మూడేళ్లయినా పిల్లలు కలగలేదని పేర్కొన్నారు. ఆమె తల్లి ఆరోగ్యసంరక్షణలో భాగంగా బెంగళూరులో ఉన్న సమయంలో పట్టణంలోని అవంతి థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్న ఆయిషాను రెండో పెళ్లి చేసుకున్నాడన్నారు. అయితే ఆయిషాకు అనారోగ్య సమస్యలతో పిల్లలు పుట్టకపోవడం, మొదటి భార్య రుక్సానాకు పాప పుట్టడం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఇద్దరు భార్యలు భర్త కోసం గొడవ పడుతూ పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడం, పోలీసులు పిలిచి మందలించడం, పెద్దమనుషుల సమక్షంలో రాజీ కుదర్చడం జరిగేదన్నారు. ఈ క్రమంలో రెండోభార్య ఆయిషా తన భర్త ఖదీర్‌అహ్మద్ తనను మోసగించి పెళ్లిచేసుకున్న ఘటనలో మొదటిభార్య రుక్సానా ప్రమేయం ఉందని, ఇరువురిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ కేశప్ప, సీఐ మురళీకృష్ణ

ముందుగానే వేసుకున్న స్కెచ్ ప్రకారం

కేసుల విషయమై మొదటి భార్య రుక్సానా, ఆమె కుటుంబ సభ్యులు భర్త ఖదీర్‌అహ్మద్‌పై ఒత్తిడి తేవడంతో భరించలేక ఆమెను అంతమొందించాలని నిర్ణయం తీసుకున్నాడన్నారు. రెండో భార్య తమ్ముళ్లు అయిన షేక్ ప్యారేజాన్, సులేమాన్, షేక్ అహ్మద్‌ల సహకారంతో ముందుగానే వేసుకున్న స్కెచ్ ప్రకారం లెక్చరర్ రుక్సానా కదలికలపై సమాచారం అందించి చంపేశారన్నారు. కేసు విచారణలో భాగంగా ఈ నెల 4వ తేదీన ప్రధాన హంతకులు షేక్‌ప్యారేజాన్, సులేమాన్, షేక్ అహ్మద్‌లను అరెస్ట్ చూపామని, తర్వాత దర్యాప్తులో వారిచ్చిన సమాచారం మేరకు భర్త ఖదీర్‌అహ్మద్(34), షేక్ అయాజ్‌అహ్మద్(26), షేక్ దాదాపీర్(33), షేక్ జాఫర్ బాషా(53)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతున్నామన్నారు. అధ్యాపకురాలి హత్య కేసును జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతోపాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేయాలని ఆదేశించడంతో సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. రెండో భార్య ఆయిషా పరారీలో ఉందని, త్వరలోనే అమెను అరెస్ట్ చేస్తామన్నారు. సమావేశంలో టూటౌన్ సీఐ మురళీకృష్ణ, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

కారు దగ్ధం



కాలిపోయిన కారు

వల్లూరు : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండలంలోని సత్యా గ్రీన్ సిటీ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి కారు దగ్ధమైంది. కడపలోని యర్రముక్కపల్లె నిత్యా కాలనీకి చెందిన రవి కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురం నుంచి కడపకు బయలుదేరాడు. సత్యా గ్రీన్ సిటీ సమీపంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంజిన్ నుంచి మంటలు రావడంతో కారును రోడ్డు పక్కకు దింపి నిలిపారు. వెంటనే అప్రమత్తమై కారు నుంచి దిగారు. ఈ క్రమంలో వారు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో చికిత్స కోసం కడపకు తరలించారు. ఈ మార్గంలో వెళుతున్న వాహనదారులు అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇవ్వడంతో.. వారు వెంటనే వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే కారు కాలిపోయింది.

తప్పిపోయిన మహిళ ఆచూకీ లభ్యం

పెనగలూరు : మండలంలోని కొండూరు దళితవాడకు చెందిన తప్పిపోయిన చెవిటి, మూగ మహిళ ఆచూకీ లభ్యమైనట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఈ నెల 5వ తేదీన పూలతోట లక్ష్మీదేవి తప్పిపోవడంతో తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. రాజంపేట రైల్వేస్టేషన్‌లో ఆమె ఆచూకీ లభ్యమైనట్లు ఎస్ఐ తెలిపారు. ఆమెను తల్లిదండ్రులు, భర్త కృష్ణయ్యకు అప్పగించారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

రాజంపేట రూరల్ : జెల్లకోనలో 40 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకోవటంతోపాటు ఇద్దరు కూలీలను అరెస్టు చేసినట్లు జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ తెలియజేశారు. స్థానిక అటవీ శాఖ కార్యాలయ ఆవరణలో ఆయన సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. శేషాచల అడవులలో కూబింగ్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. మండల పరిధి రోళ్లమడుగు బీటులోని ఎస్ఆర్ పాళెం సెక్షన్ అటవీ ప్రాంతంలో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాకు చెందిన వెంకట్రామన్, శరవణన్ అనే ఇద్దరు కూలీలను అదుపులోకి తీసుకున్నట్లు తెలియజేశారు. వారి వద్ద నుంచి రూ.3 లక్షల విలువ చేసే 40 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. సమావేశంలో ఏఫ్ఎస్ఓ ఎస్ రవిశంకర్, ఎఫ్‌బీఓ జి.కిరణ్‌కుమార్, బేస్ సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులో ఆరుగురి అరెస్ట్

సిద్దవటం : సిద్దవటం పోలీసుస్టేషన్‌లో ఈ నెల 3వ తేదీన నమోదైన ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులో సోమవారం కడపకు చెందిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ తెలిపారు. సిద్దవటం పోలీసుస్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని మాధవరం–1 గ్రామానికి చెందిన డ్రైవర్ కత్తి శ్రీనివాసులు ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరానికి చెందిన మహిళ వెంటపడేవాడన్నారు. ఈ విషయాన్ని ఆమె స్నేహితుడు కడపకు చెందిన వంశీకి తెలపడంతో.. వంశీ తన స్నేహితులైన వంశీరాహుల్, ధనుష్, నరసింహారెడ్డి, అజయ్, ముక్తియార్‌లు కలిసి కత్తి శ్రీనివాసులును కులంపేరుతో దూషించి, దాడి చేసి, భయభ్రాంతులకు గురిచేశారన్నారు. దీంతో బాధితుడు ఈనెల 3వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిద్దవటం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందన్నారు. ఈ మేరకు కడపకు చెందిన వంశీతోపాటు అతని స్నేహితులను సోమవారం సిద్దవటం మండలంలోని భాకరాపేట చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తులసీ నాగప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎండీ షరీఫ్

కుప్పం కోట కూలిపోతుందనే అక్కసు

రైల్వేకోడూరు : కుప్పం కోట కూలిపోతుందనే ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు అక్కసు అని, అందుకే దాడులకు ఉసిగొల్పారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం, 14 ఏళ్లపాటు సీఎంగా పని చేసిన చంద్రబాబు ప్రజలకు చేయలేని అభివృద్ధి.. కేవలం 4 ఏళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపించారన్నారు. పోలీసులను తరమండి, కొట్టండి అంటూ వారిపై రాళ్లు రువ్వడం, వ్యాన్లను తగులబెట్టడం ఇలా దగ్గరుండి మరీ పుంగనూరులో విధ్వంసకాండను చంద్రబాబు సృష్టించాడని ధ్వజమెత్తారు. పోలీసులు చొరవతీసుకోకపోతే ఎంత ప్రాణనష్టం జరిగేదో తెలియదా అని ప్రశ్నించారు. పుంగనూరులో కంటే ముందుగా అంగళ్ళులో పక్కా ప్లాన్ ప్రకారమే కార్యకర్తలను రెచ్చగొట్టి అలజడులు రేపారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబంపైన చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు హేయం అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆదరిస్తుంటే ఓర్వలేక ప్రాజెక్ట్‌ల సందర్శన పేరుతో చంద్రబాబు, యువగళం పేరుతో ఆయన తనయుడు లోకేష్ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు సర్వప్రయత్నాలు చేస్తున్నారనే విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు రైల్వేకోడూరు నియోజకవర్గంలో సుమారు రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, పట్టణ అధ్యక్షుడు సిహెచ్.రమేష్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి

బైక్‌ను ఢీకొన్న కారు

కాశినాయన : మండలంలోని బసనపల్లె నాలుగు రోడ్ల కూడలిలో మోటారు బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. నాయునిపల్లె గ్రామానికి చెందిన ఆదిమూలపు రామముని, బూదాల చిన్నరామయ్యలు బైక్‌పై పోరుమామిళ్ళ నుంచి స్వగ్రామానికి వెళుతుండగా.. బసనపల్లె నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆనంవారిపల్లె నుంచి నరసాపురం వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నరామయ్య, రామమునిలకు గాయాలయ్యాయి. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

రాయచోటిటౌన్ : సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ డీపీఎండీసీ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీపీఎండీసీ రైతు సాధికార సంస్థ ప్రతినిధులు ఏర్పాటు చేసిన కూరగాయల స్టాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యకరంగా ఉండాలంటే సేంద్రియ పద్ధతిలో పండించిన ఆహార పదార్థాలను మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. అందుకోసం ప్రజల అభిప్రాయాల మేరకు కూరగాయలు సరఫరా చేయాలని తెలిపారు. దీనిపై స్పందించిన డీపీఎం యశోద మాట్లాడుతూ ఎక్కడైనా ఉద్యోగులు 50 కుటుంబాల వారు కోరితే వారికి అనుకూలమైన ప్రదేశంలో.. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు అమ్మకానికి ప్రత్యేకమైన షాపును ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 50 గ్రామాలలో 50 వేలకు పైగా రైతులు 63 వేల ఎకరాలలో వివిధ రకాల ఆకు కూరలు, కూరగాయలు పండిస్తున్నట్లు తెలిపారు. వీరు సేంద్రియ పద్ధతిలో పండించినట్లు నిర్ధారించడానికి పీజీఎస్ సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఏ పవన్, ఎంటీ పద్మావతి తదితర అధికారులు పాల్గొన్నారు.



కూరగాయల స్టాల్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్

నవోదయను సందర్శించిన బార్క్ శాస్త్రవేత్తలు

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని ఆకేపాడు వద్ద గల నారంరాజుపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయాన్ని సోమవారం ముంబైలోని బార్క్(బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్)కు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఉత్తమ్ జైన్, డాక్టర్ పృథ్వీష్ చౌహాన్‌లు సందర్శించారు. శాస్త్ర సాంకేతిక విషయాలపై వారు విద్యార్థులకు వివరించారు. బార్క్‌లో జరుగుతున్న పరమాణు పరిశోధన వంటి వాటిపై అవగాహన కల్పించారు. భారత్ శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎదుగుతున్న తీరును వివరించారు. విద్యార్థులు ఈ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకోవడానికి ఉన్న అవకాశాలను వివరిస్తూ మార్గాలను విశదీకరించారు. పరమాణు ఉపయోగంలో రేడియేషన్ పట్ల ప్రజలలో ఉన్న అపోహలను తొలగించాలని, రేడియేషన్‌ను సక్రమ మార్గంలో వాడుకున్నప్పుడు మానవ మనుగడకు ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు. కేన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులను నయం చేస్తుందని తెలియజేశారు. లేజర్ చికిత్సలో కూడా ఎంతోగానో ఉపయోగపడుతుందని, రేడియేషన్ పట్ల భయపడాల్సిన అవసరం లేదని తెలియజేశారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి అవగాహన కల్పించటంతోపాటు వారి సందేహాలను నివృత్తి చేశారు. విద్యాలయ ప్రాచార్యులు పీ గీత మాట్లాడుతూ దేశంలోనే ప్రతిష్టాత్మకమైన బార్క్ సంస్థ నుంచి శాస్త్రవేత్తలు విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అవగహన కల్పించడం ఎంతో సంతోషమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం బార్క్ శాస్త్రవేత్తలు గీతకు సర్టిఫికెట్ అందజేశారు.



నవోదయ ప్రాచార్యులు గీతకు సర్టిఫికెట్ అందజేస్తున్న బార్క్ శాస్త్రవేత్తలు